# కిరీటి

[కథ]

✽

= శ్రీ కడారు పోల-గురవాచార్య =

[గతిసంచిక తరువాయి]

కిరీటిమనస్సు కిదంతా అయోమయంగా, అగాధంగా ఉంది. "చిన్ననాటినుంచీ కలిసీ మెలిసీ తిరుగుతూ అన్యోన్య హృదయులం అనుకున్న ఆత్మీయుణ్ణి ఇలా వేరుపరచడంలో తల్లి ఉద్దేశ్యం ఏమిటో?... ఆమె అయినా ఇంతక్రితం ఎన్నడూ ఇలా అనిపించలేదే?..." అని కిరీటిమనస్సు పరిపరివిధాల పరుగులుతీస్తోంది. "ఆహా!... యౌవనం అనే ఒక నూతనరూపం వచ్చి స్వేచ్ఛగా మాట్లాడుకోనివ్వదలిచినా మమ్మల్నే అటకాయిస్తోందిగదా" అన్న ఊహాప్రపంచంలో పర్యటనం చేయసాగింది కిరీటిమనస్సు!

అతని మనస్సులో తలదాచుకున్న సందేహం తిరిగి ఒక్కసారి విజృంభించి, తలెత్తి చూసింది. దానితో కిరీటిమనస్సు కంపించిపోయింది.

ఈ చికాకుతో "రామూ! చాల్లే ఇక ఆట. ఆ కరకట్టకేసి పోయివద్దామా?" అంటూ చివ్వున లేచి నిలబడ్డాడు.

"మోసానా! నువ్వే ఓడిపోయావు. బాకీ తీర్చటమే కాదు; పైగా నువ్వు నాకే బాకీపడ్డావు." అని పకపకా నవ్వుతూ, చప్పట్లు కొట్టుకుంటూ లేచిపోయాడు రామూ.

ఆమాటలూ, ఆనవ్వూ కిరీటిచెవిని పడి ఉండవు. అథవా వినబడినా ఆ ఆలోచనాసముద్రంలో అతని కేరింతలెక్కడో మునిగిపోయినవో!

బావమరదులిద్దరూ కలిసి వాహ్యాళికి పోతోంటే, రాఘవమ్మ కొడుకుని వెనక్కి పిలిచింది. కొంతటికి ఇద్దరూ కలిసి వెళ్లిపోయారు.

## ౨

కరకట్టమీద నడుస్తోన్నప్పుడు రామూ కిరీటితో వనజవివాహప్రస్తావన తెచ్చాడు.

"ఆ! ఇప్పుడు నా పెళ్లికేంతే రామూ? ఇంకా ఎక్కడ? చదువు పూర్తికావాలిగా!" అనేశాడు కిరీటి.

"మరి వనజను ఇంకా ఎన్నాళ్లని పెండ్లిచేయక వదిలిస్తాం? సంబంధాలుకూడా వస్తోనే ఉన్నై. ఏదో నీకివ్వాలనికూడా అనుకున్నారుగా మరి! అందుకని, నీ సంగతికూడా తేలిపోతే, ఏదో ఒక సంబంధాన్ని ఖాయపర్చుకోవాలనే చూస్తోన్నాం..." అన్నాడు రామూ.

కిరీటి కొంతసేపటివరకూ ఏజవాబూ ఇవ్వలేదు. అలానే ఇద్దరూ ఆలోచనలతోనే ఒకరివనకాలొకరు కొంతసేపు అడుగుల్లో అడుగులు వేసుకుంటూ నడిచారు. దూరంనుంచి హోరు వినబడుతోంది. రొదగాలి వీస్తోంది... నీటిఅలలు వయ్యారంగా, జలజలా పడగెత్తి ప్రాకుతోన్న త్రాచుల్లాగ ఒడ్డుకు వస్తూ, తపతప కొట్టుకుంటున్నై. అంతలంతలుగా మట్టిపెళ్లలు ఒడ్డువిరిగి మధ్యమధ్య ధబేలుమని నీటిలో పడుతూన్న శబ్దం ఆ ప్రశాంతతలో వినబడుతూనే ఉంది.

"నేనూ అదే ఆలోచిస్తోన్నాను." అన్నాడు కిరీటి కొంతదూరం పోయాక.

"అదే అంటే?" అని తిరిగి ప్రశ్నించాడు, వెనకాలనే నడుస్తూన్న రామూ. కాని జవాబు రాలేదు.

తిరిగి అదే ప్రశ్న ప్రశ్నించాడు రామూ. కాని ఆ మాటలు గాలిహోరులో కిరీటికి వినబడినవో లేదో మరి! జవాబుమాత్రం ఈసారీ లేదు. తిరిగి రామూ ప్రశ్నించనూలేదు.

*　　*　　*　　*

ఆనాటి రాత్రి భోజనాలముందు, "వనజలక్ష్మికి మంచి మనువే వచ్చిం"దని ఉద్దండయ్య వడ్డిస్తూన్న భార్యముఖంకేసి చూస్తూ అన్నాడు.

"ఎప్పుడూ"అని భోంచేస్తూన్న కిరీటి పాల బారుతూ అన్నాడు.

"ఆఁ...ఇవ్వాళనే...కోర్టుదగ్గర రంగయ్యగారని—ఇప్పుడు బెజవాడలోనే ఉంటూన్నారులే!—కనబడి, వనజను చూడటానికి వారంపదిరోజుల్లో వస్తామన్నారు...సరే వస్తే వస్తారనుకో! దానికేంగానీ?—బాపయ్యే వారికి కబురుపెట్టాడట! విన్నావా?" అంటూ భార్యమొఖంకేసి చూస్తూ కాసేపు ఊరుకున్నాడు. "దానిమీదటనే; ఆయన ఇవ్వాళ తారసిల్లి యీప్రస్తావన తెచ్చాడు."

"ఎప్పుడు కబురంపే డంటూరు? మనకు తెలియనే తెలియదే!"అని ఆశ్చర్యపోతూ అంది.

"మన కెలా తెలుస్తుందీ?...అ దెప్పుడు కబురు పెట్టాడో ఏమో మరి! మీఅన్నయ్య అంటే సామాన్యుడా?" అన్నాడు.

తల్లీకొడుకు లిద్దరూ ముఖముఖాలు చూచుకున్నారు.

"ఆ కుర్రాడు యమ్. బి., బి. యస్. నాల్గేళ్ళనుంచీ చదువుతున్నాడట. మరోరెండేళ్లు చదవాలట!...మంచి స్థితిమంతులు...పెద్ద మొఖాసాకూడా ఉందని చెప్పుకుంటూ ఉంటా"రని చెప్తూ మంచినీళ్లు త్రాగుతూ ఊరుకున్నాడు.

"అయితే ఇంకేం?...లక్ష్మి అదృష్టవంతురాలే"అని కళ్లు తేలేసింది కృష్ణవేణమ్మ.

"ఆఁ, ఆఁ, దానికేం?...లక్షాధికారిణి అవుతుంది"అని ఉద్దండయ్య అంటూనే మధ్యలోనే ఆగిపోయి, "అవునుగాని, వాళ్లు పెద్దపెద్ద సంబంధాలు చేసుకోవాలని తాపత్రయపడుతూంటే—కిరీటి కిమ్మని మన మెలా అడుగుతాం.?" అన్నాడు.

"అడగడాని కేం ఉంది? వాళ్లూ, మనమూ అనుకుంటూన్న విషయమేగదూ"అంది భార్య.

"ఎంత మనమూ మనమూ అనుకున్నా వాళ్లకు మన కివ్వాలనే ఉంటే ఇతరత్రా ఇలా ఎందుకు ప్రాకులాడుతోంటారు?...పోనీ, మనమే అడుగుతా మనుకో! వాళ్లు మనమాట నిలుపుతారనే నమ్మకం నాకుమాత్రం లేదు..."అని ఖచ్చితంగా అన్నాడు ఉద్దండయ్య.

"అంతే నంటారా?"అని తిరిగి అంటూ భర్త ముఖంకేసి చూస్తూ ఉండిపోయింది.

"అయినా పెద్దఎత్తుల్లో పరుగులు తీయాలని దూకుతూన్నవాళ్లు కర్మంచాలక మనకిచ్చినా వాళ్ల కోరికలకు మనం నిభాయించుకోగల మంటావా?..... కాకపోయినా వారికి పెద్దపెద్ద కోరిక లున్నప్పుడు మన మడ్డుపడటం ఏమంత భావ్యం? పైగా మన కేమంత గ్రహచారం? అడిగి కాదనిపించుకోవటం! ఒకవేళ వాళ్లంతట వాళ్లే మనల్ని అడిగినా అది నిష్ఠూరం లేకుండా తప్పించుకోవాలనే ప్రయత్నమేగాని రూఢయిన మాట కాదు. అలాంటప్పుడు మనం ఉపేక్షించటమే శ్రేయస్కరం" అని తొణక్కుండా, నిశ్చితాభిప్రాయాన్ని తేల్చేశాడు. ఈ మాటలన్నీ వింటూన్న కిరీటికి తండ్రిమాటలే నిజమేమో అనిపించింది. కాని మనస్సు ఆలోచనలతో బరువెక్కిపోయింది. గబగబా నాలుగు ముద్దల్లో అన్నమంతా మ్రింగేసి లేచి వెళ్లిపోయాడు. అవాళనుంచీ కిరీటిహృదయసాగరంలో చిన్న తుఫాను చెలరేగింది.

*　　*　　*　　*

ఆ మర్నాడు మామూలుగా ఉదయంపూట బాపయ్యగారింట్లోకి కిరీటి వెళ్లాడు. అప్పుడే వనజ త్యాగరాజకృతొకటి వీణమీద పాఠం చేసుకుంటోంది. ఆమెముఖారవిందం ఎప్పటిలాగా కళకళ్లాడుతూ కిరీటి నాహ్వానించింది. అత వనుకున్నట్టు ఆమెలో ఎంతో మార్పు కనబడాల్సింది. కాని మామూలుగానే

ఉండటం చూస్తే మొదటలో అతనికి ఆశ్చర్యం కలిగింది. చివరకు వనజకూడా ఎప్పటిలాగా ఎంతో చనువుగా మాట్లాడింది...కాని ఆమెతల్లిమాటల్లో కాస్తంత మార్పు కలిగింది.

"ఏం, కిరీటీ! లక్ష్మి కొక సంబంధం వచ్చిందని అన్నయ్యగానీ చెప్పాడా?" అని కిరీటిని అడిగింది రాఘవమ్మ.

"ఏం సంబంధం?" అన్నాడు ముభావంగా.

ఉద్దండయ్య యీవిషయం చెప్పటం మరిచిపోయాడేమోనని అన్నిసంగతులూ చెప్పింది రాఘవమ్మ కిరీటితో. చెప్తూ చెప్తూ "వాళ్లకు ఇరవై ఎకరాల కట్నంమీద చూపు ఉన్నట్టు మీ మామయ్య చెప్తూన్నారు. మన కాసంబంధమే కావాలన్న పద్ధతిలో ఇవ్వక మరి తప్పుతుందా? చెప్పు మరీ?" అని తనకు తెలీని క్రొత్త విషయంగూర్చి మాట్లాడుతూ ఉంటే, కిరీటి తలవూపుతూ అన్యమనస్కంగా వింటూన్న వాడల్లా "ఔను. అదీ నిజమే!...కట్నాలు చూచుకుని తగ్గుతే పను లెలా అవుతాయి?" అన్నాడు గొంతు సంబాళించుకుంటూ.

"అదే నేనూ అనుకుంటూన్నా! ఏదో ఖచ్చితం చేసుకుంటే రేపు వైశాఖంలోనే రామూ, వనజల పెళ్లిళ్లు నెరవేర్చుకోవాలని ఉంది. వీళ్లకు ఆ మూడు ముళ్లూ గనక కాస్తా పడిపోతే, ఇంతలో ఇక పెళ్లిళ్ల బెడద ఉండదు మాకు. ఒకగట్టున పడినవాళ్ల మౌతాం. ఇక ఎప్పటికో గదా విజయపెళ్లి! అప్పటి కెవ రెలా ఉండబోతామోలే!" అంది.

కిరీటి వెళ్లిపోవటానికని లేచాడు. "తొందరగా తేలిపోతే తీరిపోతుంది నాయనా! వనజను నీకివ్వాలనే అనుకోవటం అయిందిగా మరి. ఎవరైనా నీ తర్వాతనేగా?" అని తిరిగి అంది.

"వస్తా నత్తయ్యా" అని చెప్పుతూ వెళ్లిపోతూన్నాడు. "ఎందుకొచ్చిన వేడుకమాట లివి! మీఆంతర్యం తెలియనంతటి పిచ్చివాడు మాత్రం కాడు యీ కిరీటి" అన్నట్లు అంత జిజ్ఞాసలోనూ నవ్వుచాయలు కనబడ్డా యాతని ముఖంలో. కిరీటి గుమ్మం దాటిపోతూ ఉంటే "అమ్మ నొకసారి రమ్మన్నానని చెప్పుతావు గదూ!" అని వెనక్కి కేకేసి చెప్పింది. 'అలానే' అన్నట్టు తల తిప్పుకుంటూ గుమ్మం దాటిపోయాడు కిరీటి.

* * * *

తాను తలపెట్టిన పని క్షణాలమీద జరిగిపోయేటంతవరకూ నిద్రపట్టని స్వభావం రాఘవమ్మది. కూతురు మనువుగురించి విన్నదగ్గరనుంచీ ఆమె కదే యావ. అసలు రాఘవమ్మ ప్రోద్బలంవల్లనే రంగయ్యగారితో సంబంధం కలుపుకోవాలని కబురుపెట్టాడు రాజబాపయ్య. రంగయ్యగార్ని మరోసారి కల్సుకుని మాట్లాడిరావటం ఎందుకైనా మంచిదని, ఒకరోజు తెల్లవారు ఝూమున తొలికోడి కూయగానే లేచి, ప్రయాణసన్నాహాల్లో ఉన్నాడు.

నూతిపళ్లెంలో బాపయ్య స్నానం చేస్తోంటే తుండుగుడ్డ నూతి గట్టుమీద వేస్తూ, "ఏమోగాని, నిన్నటినుంచి కిరీటిముఖం అదోమాదిరీగా ఉంది" అంది రాఘవమ్మ.

"ఐతే ఏమంటావు" అన్నాడు బాపయ్య.

"ఆఁ, అనటాని కేముందీ?......చిన్నబుచ్చుకుని ఉన్నాడు పాపం. ఎందుచేతనో నని"

"చిన్నబుచ్చుకుని ఉన్నాడని నిక్షేపంలాంటి సంబంధాన్ని తన్నుకుని వీళ్ల చేతుల్లో పెట్టమన్నావా?" అన్నాడు తీక్ష్ణంగా చూస్తూ.

"అదే నేనూ అనుకుంటూన్నా" అని అంది.

"కాకపోతే—ఆ సంబంధం ఎక్కడ, ఇదెక్కడ?—కుర్రాడా? డాక్టరు పరీక్ష గనక ఇచ్చాడా, వేలకు వేలే సంపాదన! మనం చూస్తూనే ఉన్నాంగా? ఆ చంద్రశేఖరం ఎలా మేడలమీద మేడలు కొంటూఉందీ! ఇక వంశం అంటావా?... జమీందారీ ఛాయా; జమీందార్లతో చేతులు చేతులూ కలిపిన బాంధవ్యాలు వాళ్లవి. వారిమట్టుకు వారు పెద్ద మొఖాసాదార్లు కదా! అలాంటివాళ్ల చేతుల్లో పెట్టక, నే నెంత పిచ్చివాణ్ణే అయినా, మేనరికంకదా అని వీళ్ల కిస్తానా నేను?" అన్నాడు గాంభీర్యంగా.

"ఔను, అదీ నిజమే మరి! ఎలాగైనా సరే పట్టు పట్టి అలాంటి సంబంధమే చెయ్యాలి. ఇచ్చినా పుచ్చుకున్నా అలాంటిదే అందమూ, చందమూను ... ఎంత మేనరికం అయితే మాత్రం — దానికూడా ఉత్తమం, మధ్యమమూ లేదూ? ఊళ్లో చుట్టరికం ఊసు పోకపోతే చెయ్యమన్నట్టు ... ఎందుకొచ్చిన రంభారాళ్లు ఇవి" అంది.

"మీరైతే మాత్రం ఉద్దండయ్యగారి మాటలకు మెత్తబడేరు" అని హెచ్చరిక చేసింది రాఘవమ్మ. దానికి జవాబన్నట్టు ఫక్కున నవ్వుతూనే ఇంట్లోకి వెళ్లిపోయాడు బాపయ్య "ఆ మాత్రం నాకు తెలియదు కేం పిచ్చివాణ్ణా?" అన్న భావాన్ని వెల్లడి పరుచుకుందా నవ్వు.

3

రాజబాపయ్యగారింట్లో జరుగుతూన్న రాద్ధాంత సిద్ధాంతాలన్నీ కిరీటికి ఎప్పటికప్పుడు తెలుస్తూనే ఉన్నై. వాళ్ల దృఢసంకల్పంకూడా కర్ణాకర్ణికగా తెలిసింది. వనజ పూర్వంలాగ ఇప్పుడు తరుచుగా కనబడటం లేదు. ఎప్పుడైనా కనబడినా వనజ ఎప్పటి మాదిరిగా ప్రశాంతంగా ఉండటం చూస్తుంటే తన కున్నంత జిజ్ఞాస, తాననుభవిస్తోన్నంత ఆందోళనా ఆమెకు లేవేమోనని వితర్కించుకుంటూ ఉండేవాడు. "తన మాదిరీబాధ వనజకు లేకపోవటం ఒకందంగా చూస్తే కోరుకోతగ్గదే!" అన్న ఆలోచనలు కలుగుతూ ఉండేవి. ఒక నాటి రాత్రంతా ఈ ఆలోచనలతోనే తెల్లవారిపోయింది. — వేసంగి శెలవలు మరో నెలరోజుల కిస్తారనగా ఎప్పుడు శెలవలిస్తారా, ఎప్పుడు వనజను కలుసుకుంటానా అని రోజులు లెక్కపెట్టుకుంటూ ఉండేవాడు. ఒక్కొక్కసారి అయితే తనని చికాకుగాకూడా ఉంటూ ఉండేది. శెలవలు దగ్గరపడుతూన్న కొద్దీ ఆత్రతకూడా ఎక్కువౌతూ ఉండేది ... ప్రాణకంటకంగా ఉన్నట్టు బాధపడుతూ ఉండేవాడు.........తిరిగి తన మనస్సు నిలా సమాధానపరచుకుంటూ ఉండేవాడు: "ఎనా ఏమికష్టపడినా యీ పదిహేను రోజులేగా ... యీ వారం రోజులేగా ... ఈ కాస్తా ఓపికగనక పడితే, ఆతర్వాత, అబ్బ!, సరిగ్గా నాలుగ్ణెళ్లు మా ఊళ్లో కాలక్షేపం చేయవచ్చు. మళ్ల వనజను చూడవచ్చు" అనే ఆశనే పురస్కరించుకుని ఉల్లాసపూరితుడవుతూ ఉండేవాడు. శెలవలివ్వగానే ఇంటికొచ్చి వాలేవాడు. కొండంత అభిలాషతో ఇంటికొచ్చాడు. కాని, విధి వేరే త్రోవను నడవమని శాసించింది. "వనజ తన దిక ఎలా అవుతుంది?" అనే సందేహమే దృఢపడిపోయింది. ఇదివరలో అతనికీ సందేహమే అప్పుడప్పుడూ కలుగుతూ ఉండేది. కాని — ఇప్పుడతనికి అహర్నిశలూ ఇదే చింత. అతని అంతరాత్మ కాభావం ధగపడింది. ఏ పుస్తకం తీసి చూసినా, ఏ పని చేయబోయినా ఇవే సంగతులు కళ్లముందు దొర్లుతూ ఉండేవి. ఇవే స్మృతిపథానికి వస్తూండేవి.

కొన్నాళ్లపాటు ఎక్కడికన్నా వెళ్లితేగాని, నలుగురితోనూ ఉల్లాసంగా తిరుగుతూ ఉంటేగాని మరుపు కలగదనీ, రోజులు గడపటం దుర్లభమనీ అప్పుడప్పుడూ కిరీటి తనలో గొణుక్కుంటూ ఉండేవాడు.

ఇలానే రెండు రాత్రులూ, రెండు పగళ్లూ గడచినై. ఒకనాటి ప్రాతఃకాలమే లేచి చదువుతూ బాపయ్యగారింటి ముందునుంచి పోతూ పోతూ ముందు వాకిట్లో ముగ్గులు పెట్టుకొన్న వనజను చూసి, గుమ్మంలో అడుగు పెట్టాడు.

"నే వెళ్తున్నాను" అని వనజ నుద్దేశించి అన్నాడు. వంగి ముగ్గులు పెట్టుతూన్న వనజ తల పైకెత్తి చూసింది. కిరీటినీ, అతని దుస్తుల్నీ చూడగానే చకితురాలై అతని కేసి చూస్తూనే నిలబడిపోయింది. అతనూ ఒక్కక్షణం అలానే వనజముఖంలోకి చూస్తూనే "నే వెళ్తున్నాను." అన్నాడు తిరిగి. ఎక్కడికని బావను అడగాలనుకుందిగాని గొంతు పెగిలిరాందే! ఇంతలో తండ్రి రావటం చూసి తిరిగి తన పని తాను చూసుకుంటూంది.

"ఏం, కిరీటీ! ఇంత ప్రొద్దున్నే ఎక్కడికోయ్ బయలుదేరావ్" అని పలకరించాడు బాపయ్య, అరుగుమీద చూరులోవున్న కిల్లిచెప్పాలను క్రింద వేసి తొడుక్కుంటూ.

"ఊరి కెళుతూన్నా మామయ్యా" అన్నాడు.

"ఏ ఊరికోయ్! ఏం కథ?........శెలవల కొచ్చావ్ కామాలుగా?" అన్నాడు, కాలుస్తూన్న చుట్టనుసి చిటికెన వేలితో రాల్చుతూ.

"ఆఁ, ఏం లేదు ... మా కాలేజీ కుర్రాళ్లందరూ నాగార్జునకొండకు చూడాలని పోతూన్నారు ... వాళ్లని గుంటూరులో కలుసుకుందామని."

"సరే - వెళ్లిరా - బండివేళకూడా కావస్తోంది." అంటూనే బాపయ్య గుమ్మం దాటిపోయాడు.

కిరీటి మరోసారి వనజదీనవదనంలోకి చూస్తూనే ముందుకి కదిలివెళ్లిపోయాడు. "అప్పుడే వెళ్లిపోతున్నావేం బావా?"అన్నట్లు ఆమెముఖభావాలతి దీనంగా ప్రాధేయపడుతూఉన్నట్టున్నై. "మరేం చేసేది వనజా?"అన్న ప్రశ్నతో మనస్సును సమాధాన పరుచుకుని ఆలోచనోన్ముఖుడై కరకట్టకేసి కిరీటి వెళ్లిపోయాడు. అతనికేసి చూస్తూనే ఆమె విస్తుపోయి నిలబడిపోయింది. అతను కనుచూపుమేర దాటిపోయేసరికి, కలతచెందిన హృదయభారంతో ముందుకు వాలిపోయి, ముగ్గు పూర్తిచేస్తోంది వనజ. కాని ముగ్గంతా తప్పుతూనేఉంది. మధ్యమధ్య కన్నీటిచుక్కలా రంగవల్లికల్లో బొటబొటా రాలుతూనేఉన్నై. తప్పుతోన్న ముగ్గును చెరుపుతూనే ముగ్గుపూర్తిచేసింది. కాని తుడుపులతో పూర్తిచేసిన ఆ ముగ్గు అందంగా ఉండమంటే ఎలా ఉంటుంది?...దిగజారిన హృదయభారంతో, తొట్రుపడుతూన్న కాళ్లతో వనజ ఇంట్లోకి చేరుకుంది.

## ౪

కిరీటి నాగార్జునకొండకు చేరుకున్నాడన్న మాటేగాని, అతని మనస్సు మనస్సులో లేదు. తోటి స్నేహితులతోపాటు తింటూ, తిరుగుతూ ఉన్నాడన్న మాటేగాని మనస్సంతా ఇంటికేసే పరుగులుతీస్తోంది.

ఆ నాగార్జునకొండమీద శాలివాహనుల కాలం నాటి బౌద్ధచైత్యాలనూ, స్తూపవిహారాలనూ, నాగార్జునాచార్యుని శిల్పనైపుణ్యతనూ చూస్తూ, ఆంధ్రసామ్రాజ్యజీర్ణవైభవాన్నీ, ఔన్నత్యాన్నీ, రెండువేల సంవత్సరాల క్రితం గతించిన గాథలనూ స్మరించుకుంటూ నలుదిక్కులూ తిరిగి చూస్తోన్నారు. కిరీటి అందరితోపాటు తానూ చూస్తూ, తిరుగుతూ, వింటూ ఉన్నాడు. అందరూ చూస్తోంటే తానూ చూస్తున్నాడు; చెప్పుకుంటూన్న సంగతుల్ని వింటూన్నాడు. అంతేగాని, చూసినవి జ్ఞాపకమూఉండటం లేదు; విన్నవి గుర్తూఉండటం లేదు. మధ్యమధ్య పరధ్యానంగా చిరస్మరణీయమైన స్తూపాల్ని చూస్తూనే నిలబడిపోతూన్నాడు. అందరకూ పదాతిసైన్యాలూ, అశ్వదళాలూ కనబడుతూన్న స్తూపాలమీద కిరీటికి తన గ్రామం, తన ఇల్లు, తనవనజా కనపడుతూఉన్నై. తోటివారందరూ ఒకందుకు నిట్టూర్చుతూ ఉన్నారు; తానూ మరొకందుకు నిట్టూర్చుతూఉన్నాడు.

ఒకొక్కసారి ... "ఎక్కడికైనా పారిపోతే బాగుండును..."అని రకరకాలుగా కొందరు మనశ్శాంతి లేని సమయాల్లో విసుక్కుంటూఉంటారు. ఏమిటో! వారి ప్రాణం విసిగిపోయి అలా అనుకుంటూ ఉంటారుగాని, నిజంగా ఆలోచిస్తే, వారి మానసిక వ్యథ ఎలా తప్పుతుందీ?...కిరీటికూడా సరిగ్గా ఇలా అభిప్రాయపడే ఇంటినుంచి పరుగెత్తుకొచ్చాడు. కాని అతనికి మనశ్శాంతి ఎక్కడిదీ? నలుగురితో తిరిగైనా మరచిపోతానను కున్నాడు. చివర కదీ లేక మనస్సంతా చికాకుగా ఉంటూంది—ఇన్నాళ్లనుంచీ వనజ తన దనుకుని సుఖస్వప్నాలు కంటూ, మహోత్కృష్టమైన లక్ష్యాలతో జీవితాన్ని నింపుకుంటూ, సుఖాంతమైన జీవితయాత్ర చెయ్యాలనే సంకల్పంతో ఉవ్విళ్లూరుతూ ఉండేవాడు. ఇక వనజ పరాయివాళ్ల చేతుల్లోకి పోతోందని తలుచుకుంటూఉంటే రక్తం ఉడికిపోతోంది. "తాను కట్టుకున్న మేడలన్నీ పట్టి గాలిమేడలై కూలిపోతోంటే చూస్తూ ఊరుకోవటమేనా కర్తవ్యం?..." అన్న జిజ్ఞాసలో తగులుకొని ఇదమిత్థమని తెగించి చెప్పలేక కిరీటి బాధపడ్డాడు. ఇక్కడికి వచ్చినా అవే తలపులు తలలో తిరుగుతూ ఉన్నై. తలపులతో మనస్సుకూడా ఉద్రేకపడుతోంది.

"ఇలా అవటానికి వీల్లేదు. ఏది ఎలా పరిణమించినాసరే, తన మనోభిలాషను బయటపెట్టాల్సిందే! మనస్సులోని మాట మనస్సులోనే మ్రగ్గిపోతే ఏం ప్రయోజనం? ఇది నన్ను నేను మోసపుచ్చుకోవటం కాదూ? నా వేలితో నాకంటినే పొడుచుకోవటం అంటే ఇంతకన్నా వేరే మరొక దారుణం ఉంటుందా?" అన్న ఉద్రేకంతోనే పదవ నాటికల్లా, ఊరూరూ తిరిగి ఇంటికొచ్చి పడ్డాడు! ఈ పది రోజులనుంచీ తైలసంస్కారం బొత్తిగా లేక జుట్టంతా

రేగిపోయి, పీచులా ఉండి. ధూళిధూసరితమైన జుట్టూ, ఎడతెగని తలంపులతో, ప్రయాణబడలికతో లోనికి తోడుకుపోయిన కళ్లూ, నల్లబడిన అతని ముఖమూ చూస్తోంటే పిచ్చివాడిలాగా కనిపిస్తున్నాడు.

౫

కిరీటి ఊరెళ్లిన నాల్గయిదురోజుల్లోనే ఒకనాటి సాయంత్రం పూట స్వయంగా పెళ్లికొడుకూ, అతని తల్లీ వచ్చి వనజను చూసి వెళ్లిపోయారు. ఈ వరుడు కొత్త షోకుపురుషుడే! సూటూ, బూటూ వేసుకుని వయ్యారంగా చటచట నడుస్తూఉండేవాడు. విలాసంగా చేతిరుమాలుతో చిరుచెమటను మాటిమాటికీ తుడుచుకుంటూ మాట్లాడుతూ ఉండేవాడు.

ప్రధానంచేసుకోవటానికి తాము వారం పది రోజుల్లో తూగగలమనీ, ఒకసారి బాపయ్యగారొచ్చి మాట్లాడివెళ్లవలసిందనీ వారెళ్లిన మర్నాడే ఉత్తరం వ్రాయించారు.

రంగయ్యగారు వనజను చూసిపోయినా, ఇంతలోనే ఇలా పరిణమిస్తుందనీ, వ్యవహారం ఇలా బిగిసిపోతుందనీ ఎవ్వరూ అనుకోలేదు. ఆ ధీమాతోనే కృష్ణవేణమ్మగాని, మరొకరుగాని ఉపేక్షించడానికి హేతువైంది.

రంగయ్యగారేగనక తమ సంబంధాన్ని స్థిరపరుచుకోవటం అంటూ ఒకటి రూఢిపడినప్పుడే, ముఖాముఖీ ఉద్దండయ్యగారితోనే సంప్రదించి, నెమ్మదిమీద స్వస్తివాక్యాలు అల్లవచ్చుననుకునీ, దానికింకా చాలా నిర్ణీతకాలం ఉందనీ ఉద్దేశపడే రాజబాపయ్య కూడా ఇంతవరకూ ఉదాసీనత వహించాడు.

ఎవరి మనస్సులలోని ఉద్దేశ్యాలు వారిలోనే ఉండిపోయినై. పైకయితే తేల్చి అడగలేదుగాని, రాఘవమ్మమాత్రం యీవిషయాన్ని తన ధోరణిలో అప్పుడప్పుడూ ధ్వనింపజేస్తూనే వచ్చింది. ఈ కార్యసానుకూల్యానికి ఇంకా కాలవ్యవధి ఎంతో ఉందనీ, ప్రస్తుతం తొందరపడవలసిన అవసరం అంతగా లేదనీ, ఆ తరుణం వచ్చినప్పుడే ఆలోచించుకోవచ్చుననీ ఎవరిమట్టుకు వారు తటస్థంగా ఊరుకున్నారు......ఒకవిధంగా—కేవలం ఊరుకున్నారూ అనలేం. కాని—. ఇంత త్వరలో ఇలా తమ ఉద్దేశ్యాల నన్నింటినీ తలక్రిందులు చేసివేస్తూ, రంగయ్యగారు ప్రధానం చేసుకోవటానికి ఇంత స్వల్పకాలంలోనే తూగుతారని ఎవరూ అనుకోనైనా అనుకోలేదు.

ఉన్నట్టుండి యీ పదిరోజుల్లో జరిగిన పరిణామానికే బాపయ్య ఆశ్చర్యపడుతూ, వారు ప్రధానం చేసుకునేటందుకు సమ్మతిని తెలిపేసరికి ఉబ్బితబ్బిబ్బై, గుక్క తిప్పుకోలేక పోయాడు. పూర్వం అనుకున్న మాటలనైనా గుర్తుకుతెచ్చుకుని చివరకు లాంఛన పూర్వకంగానైనా, ఉద్దండయ్యకూ తనకూ ఉన్న ఆంతరంగిక స్నేహాన్నయినా పురస్కరించుకుని వ్యవహరించవలసినవాడైకూడా ప్రధానం చేసుకోవటం వరకూ వ్యవహారకాండ జరిగిపోతోన్నా, తన నిశ్చితాభిప్రాయాన్ని చెప్పటానికికూడా బాపయ్య కిక అవకాశం చిక్కలేదు.

ఇదంతా జరిగిన రెండుమూడు రోజులకే కిరీటి తిరిగి ఇంటికొచ్చాడు. భోజనాలూఅవీ అయాక విశ్రాంతిగా కూర్చున్న సమయంలో "వనజప్రధానం ఇవ్వాళేనట" అని తల్లి కృష్ణవేణమ్మ, ఈ వారం పదిరోజుల్లో జరిగిన సంగతులన్నీ ఒక్కొక్కటే చెప్తూ, ఈమాటా చెప్పింది...ఈవార్త వినేసరికి దారిలో ఊహించుకుని వచ్చిన ఊహలన్నీ కూడా చెల్లాచెదరై, విచ్ఛిన్నములై పోయినై. కొంతసేపటివరకూ ఒక్క మాటయినా నోటివెంబడి వచ్చింది కాదు. కొంతసేపటికి మనస్సు సంబాళించుకుని "నాకు చెప్పలేదేం అమ్మా!" అన్నాడు.

"ఔను, నీ కెలా తెలుస్తుంది? నాతోనైనా ఇవ్వాళే ఉదయమేగా అన్నయ్య చెప్పింది!" అని తిరిగి తల్లి అనేసరికి కిరీటి ఏమీ అనలేకపోయాడు... ఇక తల్లిని ఏమీ అడగనే లేదు.

ఒక పర్యవసానానికి వచ్చాక, కిరీటి తన ఆంతరంగికంలోని ఆశయాన్ని తల్లిచెవిని వేశాడు. తలిదండ్రులకు ఇంతకుక్రితం తెలియని విషయం కాదది! కిరీటి నోటివెంబడి వినకపోయినా వనజాకిరీటుల అన్యోన్యత వారికి తెలిసిన విషయమే. తెలిసినా సామాన్య దృష్టితోనే ఊరుకున్నారు. ఊరుకున్నా, ఉద్రేకపూరితుడైన కిరీటి వాగ్ధోరణి వినేసరికి తల్లికి ఆశ్చర్యమే కాదు, దుఃఖంకూడా కలిగింది. ఇక బాపయ్యను అడగక తప్పదని భార్యాభర్తలు ముఖముఖాలూ చూచుకుని తమ కర్తవ్యాన్ని కూడబలుక్కున్నారు.

ఆలోచనలతో, ఆత్రతతో ఏమీ పాలుబోక కాలుగాలిన పిల్లిమాదిరిగా కిరీటి తన గదిలో పచార్లు చేస్తోన్నాడు.

సరిగ్గా ఇదే సమయంలో అక్కడ వనజ తన గదిలో కూర్చుని పాతపాఠాలు తిరగేస్తూఉంది. మధ్య మధ్య పైట చెంగుతో కళ్లు తుడుచుకుంటూనే ఉంది. ఎడతెగని దుఃఖతరంగాలతో మనస్సు కలవరపడుతూ ఉంది.

అవాళ సాయంత్రం బండికే తనకు కాబోయే అత్తగారు వస్తుంది! ప్రధానంచేసుకుని వెళ్లిపోతుంది. ఇక తనను చూసి ఫలానావారి కోడలనీ, ఫలానావారి భార్య అనీ చెప్పుకుంటారుగదూ! ఇక, భర్త అనే ఒక నూతనవ్యక్తి తనమీద అధికారాన్ని సంపాదిస్తాడు కామాలును! అత్తవారిల్లంటూ ఒకటి ఏర్పడగనే ఇంకెక్కడి స్వగ్రామం? తనకూ తనగ్రామానికీ ఇక ఋణానుబంధం తెగిపోయినట్లేనా?" అన్న ఊహలూ, ఆలోచనలూ ఆమెమనస్సులో తలెత్తుతూఉన్నాయ్.

తన భావిజీవితాన్ని ఊహించుకుంటూఉంటే గుండె తరుక్కుపోతోంది. తన మనస్సులోని మాట మనస్సులోనే మరుగుపడిపోయింది. అది కాస్తా తనలోనే, తన అంతరాత్మలోనే క్రుగ్గి, జీర్ణించిపోవాల్సిందేకాని బయటకి పొక్కటానికైనా వీల్లేదు. మాట పెదవిదాటిందా పృథ్వి దాటే మాటే తథ్యం. దాని వల్ల కార్యసానుకూలం అవనీ, అవకపోనీ తానుమాత్రం బ్రతికినంతకాలమూ అభిమానంతో తలెత్తుకు తిరగ లేదు. ఆమెఆశయాలని విని, ఆవేదనను గ్రహించి సానుకూలపరిచేటంతటి ఓర్పు సంఘంలో లేదు. సరికదా! చివరకు విని సహానుభూతినైనా తెలిపేటంతటి ఉదారమైన వాతావరణంకూడా సంఘంలో లేందే? తాను సిగ్గువిడిచిచెప్పినా, ఏం ప్రయోజనం ఉంది? నిజంగా ఇలాంటి అభిమానవతులకు ప్రేమ ఉభయత్రా చావే! చావుకయినా కాస్తంత కనికరం ఉందేమో ననిపిస్తోంది! ప్రేమను బయట పెట్టినా — అభిమానంతో యావజ్జీవితం నలుగురిలోనూ తలెత్తుకు తిరగలేదు; తనలో మథ్యపెట్టుకున్నా దుర్భర హృదయావేదనతో క్రుళ్లి కృశించిపోవాల్సిందే గదూ? కాని బయటపడి అభిమానంతో తల ద్రద్దలై చచ్చే దానికంటే, మథ్యపెట్టుకునైనా హృదయదౌర్బల్యముతో క్రుళ్లి కృశించిపోవటమే ఉచితమేమో?... అన్న తలంపులూ, మనోసంకల్పాలూ పుట్టుకొస్తూనే ఉన్నై. వ్యాకులిత హృదయంతో, నిరాలోచనా సక్తమైన నేత్రాలతో, శూన్యదృక్కులతో ఆకాశంలోకి చూస్తూ కిటికీలోనే కూర్చుండిపోయింది. దూరం నుంచి కట్ట కట్టుకుని, బార్లు తీరి వస్తున్న కొంగలు, ఎండపొడలో తెల్లగా మెరుస్తూ, దగ్గరకు వస్తూ వస్తూనే, భాసమానమైన కిరణకాంతుల్లో కలిసిపోయి, లేవనిపిస్తూ ఉన్నై.

ఇంటిల్లిపాదీ రంగయ్యగారి భార్య రాకకోసం ఎదురు చూస్తోన్నారు. వనజ తల్లిదండ్రులూ, అన్నగారూ ఉరుకులూ, పరుగులూ తీస్తూ ప్రధానాని కన్నీ అమర్చుకుంటూ ఉన్నారు. ఆమెరాకకోసం ఎదురు చూసి చూసి రాఘవమ్మ కళ్లయితే కాయలే కాచి పోతూ ఉన్నై.

దీపాలుపెట్టే వేళ కల్లా రంగయ్యగారి పరివారంలో ముఖ్యులంతా బిలబిలా బండి దిగారు. వనజ ఇంతవరకూ వ్యాకులపడుతోన్నా, ఇక చేయతగ్గది కనబడక, ఎన్నాళ్ళనుంచో తనతో పెంపొందించుకుంటూ వచ్చిన కోరికల నన్నింటినీ, మహదాశయాల నన్నింటినీ అణచుకుని, హృదయంమీద పెద్దబండ పెట్టుకుని, అత్తగారి ఎదుట గాంభీర్యంగా కూర్చుంది.

ప్రధానం యథావిధిగా జరిగిపోయింది.

## ౬

ఆ మర్నాటి ఉదయాన్నే, రాజబాపయ్య తీరిగ్గా ఉంటూన్న సమయం చూసి, కిరీటి పడుతూన్న మనస్తాపనంతా ఆయనతో ఉద్దండయ్య ఏకరువు పెట్టాడు. వింటూన్నప్పటి బాపయ్య ముఖభంగిమలను ఉద్దండయ్య గ్రహించుకుంటూ, చెప్పవలసిన రీతిగా నచ్చచెప్పాడు. కాని, ఉద్దండయ్య ఎంత దూరాలోచనాపరుడై ప్రసంగిస్తూ ఉన్నా, ఎంత సౌలభ్యతతో సంప్రదిస్తూ ఉన్నా... ఆయన చెప్పుకూన్నదంతా ఒక చెవిలోనుంచి వింటూ రెండో చెవిలోనుంచి వదిలేస్తూ ఉన్నాడు... ఆలోచించి ఆలోచించి చివరకిలా అన్నాడు:

"బావా! ఇవన్నీ నాకు తెలియని విషయాలు కావుగాని, ప్రధానంకూడా అయిపోయిన తర్వాత ఇప్పుడేమనుకుంటే ఏం ప్రయోజనం ఉంది? ఐనప్రధానాన్ని కాదని ఏ ముఖం పెట్టుకుని వాళ్లతో చెప్పేది?... పైగా — పెద్దమనుష్యులతోటి వ్యవహారమాయె! ఈ ప్రధానం నెరవేరక ముందైతే, కిరీటి కివ్వటం నాకూ సంతోషమైన విషయమే! నాకు మాత్రం మీకంటే ఆప్తులింకెవరున్నారు బావా?" అని

స్నేహపూరిత కంఠంతో చెప్తూ చెప్తూ ఒక్కక్షణం ఊరుకున్నాడు. ఉద్దండయ్యకూడా ఏ మనటానికీ పాలుపోక అలానే చూస్తూ ఉండి పోయాడు.

"బావా, ఇన్నాళ్ళయిందిగాని, ఒక్కనాడైనా నీమాటను కాదని త్రోసిపుచ్చిన పాపాన్ని పోయానూ? ఇన్నాళ్లకు!...నిజంగా — నీమాటను కాదని చెప్పటానికి నాకు నోరుకూడా రావటం లేదు బావా?"అని ఉద్దండయ్యతో తిరిగి బాపయ్య అన్నాడు. ఇక అంతటితోనే ఆప్రస్తావన ఆగిపోయింది. తన మాటను తప్పక అంగీకరిస్తాడనీ, ఎన్నటికీ ఇలా కాదని త్రోసి వేయడనీ ఉద్దండయ్య కొక గట్టి నమ్మకం ఉండేది. కాని ఈ దఫాతో ఆ నమ్మకంకూడా అడుగంటి పోయింది. అభిమానంతో తల తిరిగినట్లయి, కిరీటిమీద కోపంకూడా వచ్చింది.

ఖచ్చితంగా ముఖంమీద ఇలా తెగేసి చెప్తూ ఉంటే, ఈ ప్రస్తావ నిక ఎత్తుకోవటమే సమంజసం కాదని ఉద్దండయ్య ఇక ఆప్రమేయానికే పోదలచుకో లేదు.

ఐతే, ఈ విషయం ఇంకా కృష్ణవేణమ్మ చెవి వరకూ రానేలేదు. మధ్యాన్నంపూట భోజనాలూ అవీ అయాక తీరిగ్గా ఉన్న సమయంలో ఒకరింటి కొకరు వస్తూ పోతూ ఉండేవారు. అవాళ కృష్ణవేణమ్మ బాపయ్యగారింటికి వెళ్లింది. మాటల సందర్భంలో "చూడు వదినా!...కిరీటి వనజనే పెళ్లిచేసుకోవాలని ఎంత పట్టుపడుతూ ఉన్నాడో?...నువ్వయినా కాస్త అన్నయ్యతో చెప్పరాదూ?" అని శాంతస్వరంతో అంది కృష్ణవేణమ్మ.

"ప్రధానంకూడా అయిన పిల్ల నెలా అడుగుతున్నావ్ వదినా?" అని రాఘవమ్మ అంది.

"మొదటినుంచీ మనం కిరీటికి అనుకుంటున్నాం గనక అడిగాను వదినా, లేకపోతే నేమాత్రం అంటానా చెప్పు?"

"నిజమే. మరి...అయిన ప్రధానాన్ని ఇప్పుడెలా తప్పించటం?...మీ అన్నగారే ఇలా అంటూంటే, ఇంక నే నేం చెప్పేదీ?...నే నీ మాటగనక ఎత్తితే నా మీద విరుచుకుపడతారు వదినా!" అని రాఘవమ్మ అంది. వీరి సంభాషణనంతా ప్రక్కగదిలోనుంచి వనజ వింటూనే ఉంది. వనజసఖి శారదకూడా ఆ గదిలోనే ఉంది. శారద వయస్సులో చిన్నదైనా, ఎదుటివారి ఆంతరంగికాన్ని ఇట్టే గ్రహించుకోగల సూక్ష్మజ్ఞానం ఆమెకుంది. తన మనస్సులో ఎంత ఉంటుందో అంతా బయటపెట్టే స్వభావం శారదది! వీరి మాటలన్నీ వింటూన్న శారద, తన కున్న చనువునంతా ఈ విషయంలో వినియోగపరుచుకుని మాట్లాడకుండా ఉండలేకపోయింది.

"పిన్నిగారూ! మీ రలా అంటే నే నిక చెప్పలేనుగాని, కిరీటి కివ్వాలని మీ కున్నదంటే ఏ పెద్దమనిషి కాదంటాడూ? చెప్పండి?...మీకు నిజంగా ఇవ్వాలనే ఉద్దేశ్యమేగనక ఉంటే ఈ ప్రధానా లొక అడ్డా పిన్నిగారూ?" అని మందహాసం చేస్తూ శారద అంది. దానితో రాఘవమ్మకు ఒళ్లంతా భగ్గున మండిపోయినట్లయింది. కాని, వస్తూన్న ఆవేశాన్ని కాస్త సంబాళించుకుని, "మునుపూ, ముందూ అయిన ప్రధానాల్ని తప్పించుకోవటం మా ఇంటా వంటా లేవు శారదా!" అంది కుపితస్వరంతో.

"మీ ఇంట లేవుగాని, మా ఇల్లొకటే, మీ ఇల్లొకటేనా వదినా?" అని కృష్ణవేణమ్మ అంది. శారద తనలోనే చిన్ననవ్వు నవ్వుకుంది. "పిన్నిగారూ! మీకు కోపం వస్తే నె చెప్పలేనుగాని, పెద్దపెద్ద కట్నాలిచ్చి, పెద్దసంబంధాల్ని తేవాలని తాపత్రయపడటం, అల్లుళ్లు పెద్ద ఉద్యోగాలు చేసి పెద్దగా సంపాదించాలనీ, మనమ్మాయి ధనవంతురాలవ్వాలనీ కోరుకోవటం— ఇవన్నీ ఏవిధంగా చూసినా, చివరకల్లా పిల్ల సుఖసౌఖ్యాలకే కదూ?" అని రాఘవమ్మకళ్లల్లోకి చూస్తూ అంది.

"ఇందులో కోపం రావటాని కేం ఉందీ?... ఉన్నమాట అంటేగదమ్మా మరి!"

"చివరకు ఇవన్నీ ఉండికూడా ఆత్మకు శాంతన్నదే ఉండకపోవచ్చును. ఆత్మసుఖం ఉండికూడా ఇవన్నీ లేకనూ పోవచ్చు. నిజంగా, వనజా కిరీటులకున్న ఆంతరంగిక అన్యోన్యతను చూసి మనం సంతోషించాల్సిన పని!...కాని—..."

"ఇప్పుడు వనజకుమాత్రం భోగభాగ్యాల కేం లోటు?...వారూ వీరికంటే అనేకరెట్లు ఆస్తిపాస్తులున్నవారు" అని రాఘవమ్మ తన మనస్సులో అనుకుంది ... ఈ మాటేగనక పైకన్నటయితే, "భోగభాగ్యాలు కావు, మన్నా!" అని శారద తప్పక తనలోనూ అనుకునేది.

"చూశారా పిన్నిగారూ!... చిన్నప్పటినుంచీ మీరూ మీరూ వేడుగ్గా అనుకున్న మాటలుకూడా ఈ రసాభాసకు కొంత కారణమే! యుక్తవయస్సు వచ్చి, నవయవ్వనంలో ఉన్న మనస్సు అనేక డొంకలు తిరిగి వస్తూన్న సమయంలోకూడా—ఇంట్లో తిరుగుతూన్న మేనత్తమేనమామ బిడ్డల్ని చూసి, వారికిలాంటి సంబంధాల్ని అంటగట్టుతూ ఉంటారు కదూ? కర్మవశాత్తూ అందులో ఏ ఒక్కరికైనా ఆ ప్రాయంలో మమత కల్గవచ్చు! లేదా ఆ ఉభయులకూ ప్రేమబంధం ఏర్పడవచ్చు!...అంతవరకూ బాగానే ఉంటుంది... చివరకు కార్యరంగంలోనికి దూకేసరికి ఈ నాడు మీరు చేసినట్లుగా ఏ పరాయివాళ్లో వచ్చి తన్నుకుపోతారు ...గద్ద కోడిపిల్లను ఎత్తుకుపోతోండటం చూసి, తల్లి రెక్కలల్లార్చుకుంటూ విలపించాల్సిందేగాని ఏం చెయ్యగలదూ?...అలాగే, ఆ ఒక్కరో, లేక ఆ ఉభయులో వ్యాకులంతో క్రుంగిపోవాల్సిందేకదూ?... నేనన్నానని కాదుగాని ... కొంతవరకు మీ రనుకున్న అప్రస్తుత సంభావణల ఫలితమే కాదూ మీకూ మాకూ ఈవివాదాలకు హేతుభూతమైంది? రాఘవమ్మగారూ! మీరు నన్ను కోప్పడినాసరే, ఇంతలోనే నాకేమీ చిన్నతనం రాదుగాని, ప్రేమబంధంతో కలిపి కట్టబడిన వనజాకిరీటి మనస్సులకు ఈ ప్రధానం ఒక అడ్డా పిన్నిగారూ?" అని అవ్యక్తమైన స్వరంతో అంది శారద.

"ఇవన్నీ నాకేం తెలుస్తవి తల్లీ! వారిష్టం!... మధ్య నాకెందుకీ పెద్దరికం?" అని ఆఖరిమాట అనేసింది రాఘవమ్మ. ఇక అంతటితోనే ఆప్రసంగం కట్టుబడి పోయింది.

ఇవన్నీ ప్రక్కగదిలోంచి వనజ వింటూనే ఉంది. కిరీటిమీద తన కేదో అనిర్వచనీయమైన అధికారం ఉందని అప్పుడప్పుడూ ఆమె గర్విస్తూఉండేది! ఏనాడయితే తనను చూడటానికని పరాయివాళ్లను తన తండ్రి ఆహ్వానించాడో, ఆరోజునే ఆమెనెత్తిని పెద్ద పిడుగు పడినట్లయింది. ఇన్నాళ్లనుంచీ తనలో ప్రతిష్ఠించుకుంటూ వచ్చిన సర్వాధికారాన్నికూడా వదులుకోవలసి వస్తుందని గ్రహించే, ఆమెహృదయం తహతహలాడిపోయింది. అవిరళమైన ఆవేదనతో అల్లాడిపోయింది. ప్రధానం కాస్తాకూడా అయిపోయిన తర్వాత ఆశ నిరాశచేసుకుని, హృదయాన్నొక రాయిగా మార్చుకుని కన్నీరు కార్చుతూనే ఎంతో గంభీరంగా ఒక నిశ్చితాభిప్రాయంతో తిరుగుతూ ఉండేది. కాని ఉద్దండయ్యగారి ప్రయత్నం చెవినిబడేసరికి కునికిపోతూన్న ఆశాజ్యోతి రెపరెపలాడుతూ తిరిగి తేజోవంతమైంది. ఒక్కొక్కప్పుడు దీపం ఆరిపోయేముందు రెపరెపలాడుతూ ఇలా తేజోవంతమవటం కూడా ఉంది! ఇంతవరకూ ఆశాపూరితమైన మనస్సుతోనే వారి ప్రసంగాన్ని వింటూ కూర్చుంది. చివరకు ఈ ప్రయత్నంకూడా విచ్ఛిన్నమైపోయిందని తెలుసుకునేసరికి కాస్త ఆగిఉన్న హోరు తిరిగి ప్రచండమై వీచసాగింది. దానితో ఆమెఆశాజ్యోతికూడా చప్పున ఆరిపోయింది. ఇక వెలగదు. చమురూ, వత్తీ—అన్నీ ఉన్నై ఆ ప్రమిదలో... కాని, జ్యోతిమాత్రం మృగ్యమైపోయింది! కిరీటికూడా తనకుమల్లే క్లేశపడుతున్నాడని ఆమె రూఢిపరుచుకునేసరికి కుమిలిపోతోన్న హృదయాగ్నిని తిరిగి రగుల్కొల్పినట్లయింది! హృదయం దహించుకుపోతోంది.

వీరి సంభావణ వింటూన్నకొద్దీ గతించిన గాథంతా కళ్లకు కట్టినట్టయి, గడచిన దినాల్ని వెదుక్కుంటూ ఆమెమనస్సు పిచ్చిపిచ్చిగా పరుగులు తీస్తోంది. జారుకొంటోన్న అశ్రువుల్ని తలవంచి తుడుచుకుంటూ ఉంటుంటే, తన మెడలో జిగజిగ మెరసిపడుతూన్న రాళ్లగొలుసు — తన అత్తవారు పెట్టింది — ఒక ఉరితాడులాగా కనబడింది. ఆ ఒక్కొక్క రత్నానికీ తేనెతుట్టెల పట్టిక లెన్నయితే ఉంటవో, ఆమెకూ అంతులేని అన్ని ఆలోచనలూ, సంభవాసంభవములైన ప్రశ్నలూ, సమాధానాలూ కలుగుతూనేఉన్నై.

ఇన్నాళ్లనుంచీ తమ మనస్సుల్లో ప్రతిష్ఠించుకుంటూవచ్చిన అధికారమూ, ఆదరమూ, ప్రేమా — సర్వస్వానికీ ఇక వారు తిలోదకాలు వదలుకోవాల్సిందే గదూ?........నిస్సందేహంగా అవన్నీ తుడుచుకుపోవాల్సిందే! కారణం?...?...ఇదిగో! కళ్లకు కనబడుతూన్న ఈనగలే ప్రబలసాక్ష్యం! తమలో పుట్టి, తమలో పెరిగి అంతరంగంలో ఐక్యమైపోయిన ప్రేమకుకూడా ఈమాత్రపు విలువైన బాహ్యసాక్ష్యం లేకనేకదూ తాము ఓడిపోయింది? క్రియారూపంలో కనబడుతూన్న ఈ ప్రధానానికి ఇచ్చినంత విలువ, ఉన్నంత చెలామణీ వీరి ఆంతరంగిక ప్రేమకుకూడా లేకపోయిందే! ఇవేనా లోకలక్ష్యాలు? ఇవేకదూ మన మూఢనమ్మకాలూ, అత్యాచారాలూను?" అని వనజమనస్సు కంపించిపోయింది. మెడలో ఉన్న

ఆ గొలుసు భారమై, గుండెమీద పెద్ద రాయి పెట్టినట్లయి, హృదయాన్నే అణచివేస్తూన్నట్టు ఆమె బాధపడుతోంది.

౭

క్రమంగా రెండుమూడు మాసాలిలానే గడచినై తర్వాత, ఒకరోజు ఉదయాన రాజబాపయ్యగారు కొడుకువివాహం చేసుకుని బ్యాండుసాన్నాయీలతో, నౌబత్ ఖానా, బాకారండోళ్లతో, తాసామర్పాలతో వియ్యాలవారి ఊరంతా దద్దరిల్లజేసి క్రొత్తకోడలితోపాటు సుఖంగా తిరిగి తమ ఇంటికి చేరుకున్నారు. ఇక వనజవివాహానికి సరిగ్గా రెండు రోజుల వ్యవధే ఉంది.

తన్ను పెళ్లికూతుర్ని చేసిన రోజునే ప్రప్రథమ నమస్కారం కిరీటిబావకే చెయ్యటం ఉచితమని వనజ తలచింది. కాని అవకాశం చిక్కలేదు. అందుచేత, వివాహం అయ్యేముందైనా కిరీటిపాదాలమీద పడి ఏడవాలనీ, తనహృదయం విప్పి అనేక సంగతులు చెప్పుకోవాలనీ ఆమె సంకల్పించుకుంది. అందుకని, ఇవ్వాళనే తాను కిరీటిని చూడాలనికూడా స్థిరపరుచుకుంది.

సూర్యాస్తమానమైంది. ప్రొద్దుగుంకినా ఆకాశంపై జేగురువర్ణంమాత్రం విడిచిపెట్టలేదు. అప్పుడే సంధ్యచీకటులు ఇంట్లో నలువైపులా ఆవరించుకుంటూన్నై. వనజ దృష్టినిగిడ్చి ఇంట్లో ఎవరైనా తన కెదురుపడతారేమో అన్న ఆదుర్దాతో అటూ ఇటూ కాస్త నిదానించిచూసింది. ఎవ్వరూ ఎక్కడా కనబడకపోయేటప్పటికి వనజ కిరీటిగదిలోకి నిరాటంకంగా ప్రవేశించింది. కర్మంచాలక ఎవరైనా ఆమె కెదురుపడినా, ఇక ఆమెమాత్రం భయపడదని తత్కాలపు ముఖలక్షణాలనుబట్టి ఇట్టే గ్రహించవచ్చు.

ఆగది నాల్గుమూలలా చీకటినీడ లాడుతూ ఉన్నై. గదిలో ఎక్కడ ఏమున్నదీ సరిగ్గా కనబడటంలేదు. కాని కిటికీప్రక్కగా కుర్చీవేసుకుని మౌనంగా కూర్చునిఉన్న కిరీటిమాత్రం ఆ కనుచీకటిలో కనబడుతూనేఉన్నాడు. షోడశకళాపరిపూర్ణుడై తూర్పుదిక్కున పొడచూపుతోన్న చంద్రునికేసి చూస్తూ, శూన్యదృక్కులతో కిరీటి అలానే ఉండిపోయాడు. వనజ నిశ్శబ్దంగా పోయి కుర్చీ నానుకుని నిలబడింది. అప్పటికీ కిరీటి పరధ్యానంగానే ఉన్నాడు; ఆమె వచ్చినసంగతే తెలియదు. కిరీటి ఇట్లా అన్యమనస్కంగాఉండటం ఆమె ఇదివర కెప్పుడూ చూడలేదు. అతని భుజంమీద చెయ్యేసి, "ఏం బావా? ఇలా చీకట్లో కూర్చున్నారేం?"అని వనజ స్నేహపూరితకంఠంతో అడిగింది.

చప్పున కిరీటి వెనక్కి తిరిగిచూసి, "ఎవరూ? వనజా!"అన్నాడు.

"ఆఁ, నేనే బావా!"

కిరీటి మొదట చకితుడైపోయి, వనజముఖంలోకి చూశాడు. అతనికి ఆశ్చర్యంలో ఆశ్చర్యం కలిగింది.

"ఏం ఇలా వచ్చావేం?"అని తొట్రుపడుతోన్న గొంతుతో అడిగాడు.

"చూసిపోదామని—"అని వనజ దృఢస్వరంతో అన్నది.

కిరీటి నిరాలోచనాసక్తమైన దృష్టితో వనజ ముఖంకేసి చూస్తూ ఉండిపోయాడు.

"అలా ఉన్నారేం బావా?"అని వనజ, కిరీటి ముఖలక్షణాలను పరిశీలిస్తూ, వ్యాకులితమానసయై అడిగింది.

"ఏం, ఎలా ఉన్నాను?......బాగానే ఉన్నానే!"అని లేని ఉత్సాహాన్ని తెచ్చుకుంటూ అన్నాడు. ఆక్షణంలో అతను పడిన అవస్థ చూసి వనజకు నవ్వుకూడా వచ్చింది. "నీమనస్సు నాకు తెలియునిదా బావా! నావద్దనేనా నీదాపరికం?"అన్న భావాల్ని వ్యక్తపరుచుకున్న దాచిన్ననవ్వు!

సుధాకరుని అమృతకిరణాలు కిటికీగుండా వనజ ముఖంమీద పడుతూఉన్నై. ఆ వెన్నెలవెలుగుల్లో వనజముఖారవిందాన్ని, ప్రకాశవంతమైన ఆకళ్లనూ కళ్లారా చూస్తూ, "ఏం వనజా! ఇలా వచ్చేవేం?" అని మళ్లీ కిరీటి మొదటి ప్రశ్ననే వేశాడు. ఆత్మతేజత పొంది కళకళలాడే అతని కళ్లల్లోకి వనజ చూడలేకపోయింది. ముగ్ధమానసయై తల వంచుకు నిలబడింది.

కొంతసేపయినతర్వాత "నే నెలా బ్రతికేది బావా?"అని గద్గదస్వరంతో అన్నది. ఈమాటలు కిరీటి చెవిని బడేసరికి అతని కళ్లల్లో నీళ్లు గిర్రున తిరిగినై. రక్తప్రసరణ ఒక్కసారిగా నిలిచిపోయినట్లు అతని శరీరమంతా దుర్బలమై, కంపించిపోయింది.

"మీకు దూరమై నే నెలా జీవించేది? దుర్భరమైన ఈ జీవితం ఎలా ముగుస్తుందా అనే నాభయంతో ధైర్యం చాలటం లేదు బావా! ఈమనస్సు నెలా శాంతపరచేది?" అని వనజ రోదనస్వరంతో అంటూనే, కిరీటి పాదాల్ని ఆధారంచేసుకుని క్రింద చదికిలబడింది.

చప్పున వనజరెండుచేతులూ పట్టుకుని, "ఇదేమిటి వనజా!" అన్నాడు కిరీటి. వనజ కిరీటిపాదాలపై తలపెట్టి "ఆశీర్వదించు బావా! నామనస్సు చెదిరిపోతోంది" అని ఏడుస్తూ అన్నది.

కిరీటి స్తబ్ధుడై కూర్చుండిపోయాడు.

...

"నే పరాయిచోటుకు పోతోన్నా. నన్ను మరువకండేం బావా?" అని వనజ అతిదీనంగా ప్రాధేయపడింది.

"ఎంతమాటన్నావు, వనజా!" అన్నట్టు అతని కళ్లు భావాల్ని స్ఫురింపజేసుకున్నై. అంతేగాని నోటితో చెప్పనైనా చెప్పలేకపోయినై.

అలా కొంతసేపు ఇద్దరూ నిశ్శబ్దంగా కూర్చున్నారు. వనజ కనుకొలకులనుంచి కన్నీరు కారుతోంది. ఆమెమనస్సులో ఒక సందేహం క్రొత్తగా స్థావరమేర్పరచుకున్నది. ఈ ఒక్క విషయంమాత్రం తన అంతర్యంలోనుంచి బైటపెట్టలేక, ఉచ్చున చిక్కిన పక్షిలాగా ఆమెమనస్సు గిలగిలా కొట్టుకుంటూన్నది. చివరకు తెగింపుచేసి, ఇలా బైటపడింది:

"ఎలా చూడదలచుకున్నావ్ బావా? ఇక... ఈ దీనురాల్ని...సోదరిగా—" అని చెప్పుతూ చెప్పుతూ పయిటచెంగుతో ముఖాన్ని కప్పుకుని ఏడవసాగింది.

ఆమె అడిగిన ప్రశ్ననూ, ఉద్దేశ్యాన్నీ కూడా కిరీటి గ్రహించుకున్నాడు. ఇవ్వాళా నిన్నా అతను వనజమనస్సుకు అలవాటుపడింది! "సోదరివి ఎలా అవుతావు?" అని కిరీటి అన్నాడు మందహాసం చేస్తూ. కిరీటిమాటల్లో, ఆ గొంతులో ఉన్న ధ్వనినిబట్టి వనజ సగంసగం లీలగా అర్థంచేసుకుని, అప్రతిభురాలై, "అదే!—" అని మెల్లగా అంటూ ఆగిపోయింది.

చాలాసేపటివరకూ కిరీటి ఏమీ మాట్లాడలేదు. తర్వాత వనజముఖంకేసి అట్టే చూస్తూ, "వనజా!" అని శూన్యహృదయంతో పిలిచాడు. అతనేం చెప్పతాడోగదా అని, తన సమాధానంకోసం నిరీక్షిస్తూ, కిరీటిపాదాల సన్నిధినే వనజ కనిపెట్టుకు కూర్చుంది.

కాని కిరీటి అనీ పతీ లేదు. తిరిగి ఆలోచనలో పడ్డాడు. ముఖమంతా అరచేతిలో ఇముడ్చుకుని, ఒక్క క్షణమాత్రం బాహ్యదృష్టిని ఆపుచేసి, వైవాహిక, సాంఘిక ప్రదేశాలు దాటి, దృష్టిని ఐహికాముష్మిక, మానసిక ప్రదేశాలవరకూ పోనిచ్చి తన సమాధానంకోసమని ప్రతీక్షించాడు. తర్వాత చెయ్యితీసుకుని, స్థిరభావంతో వనజముఖంలోకి చూస్తూ, "వనజా! నిన్నూ, గతించిన మనగాథనూ ఎన్నటికీ నే మరచిపోలేను; సోదరిగా భావిస్తారా అని నువ్వడిగేమాట ఉందే అది కేవలం అజ్ఞానులై ప్రవర్తించి పశ్చాత్తాప పడిన వారికి చెందిన మాట. అది అప్రస్తుతం. ఇక మనవంటి వారి విషయంలోనే అంటావూ?...అది కాగితాల మీద, ఇంకా ఇప్పుడిప్పుడు తెరలమీద, ఇంకా కొందరి ప్రగల్భధోరణిలోనూ కనిపించి, వినిపించేదే తప్ప మనలాంటి భగ్నహృదయాల్లోమాత్రం కనిపించదు వనజా! నా ఆత్మీయుల అనుభవాల్నించి నేను విన్నదీ, చూసిందీ ఇదే! చివరకు నా స్వానుభవంలో నా మట్టుకు నేను తెలుసుకున్నదికూడా ఇదే!!" అని చెప్పుతూ ఆగిపోయాడు. "అయితే ఇంతకీ మీరేమంటారు?" అన్నట్టు ఉత్సుకతతో వనజ కళ్లు విప్పారినై. శాంతదృఢస్వరంతో మళ్లీ కిరీటి ఇలా అన్నాడు:

"నువ్వు నన్ను ఏ విధంగానైనా అనుకోగాని, మధురభరితమైన నీ ప్రియవచనాల్నీ, నీ ప్రేమరూపాన్నీ ఎన్నాళ్లనుంచో నా మనస్సులో చిక్కబట్టుకున్నాను. ఇవ్వాళ ప్రేమబంధం తెగినంతమాత్రాన్ని నా హృదయంలో చిరఐక్యత పొందిన ప్రేమ ఎలా నశిస్తుంది వనజా! నువ్వు ఎక్కడ ఉన్నా, ఏం చేస్తున్నా, నా అంతరంగంలో నీ రూపాన్ని ప్రత్యక్షం చేసుకోగలను. చీకట్లోనూ, వెల్తురులోనూ, చివరకు గాఢాంధకారంలోనైనాసరే నీ రూపాన్ని ఇట్టే ఊహించుకోగలను. వనజా!...ఇదంతా ఒక్కమాటలో చెప్పాలంటే—నువ్వు నాకెప్పుడూ ఒకే విధంగా కనబడ్డావు. కనబడుతోన్నావు ... ఇకముందుకూడా అంతే! వనజా! నీ కిది బాధాహేతువయితే ఇక చెప్పను...నన్ను మన్నించు వనజా! నిజంగా నేను దుర్బలమనస్కుడనని ఎవరైనా అభిప్రాయపడతారేమో! కాని ఈ ఒక్కవిషయంలో మాత్రం నావంటివాళ్లు నూటికి నూరూ ఉంటారనిమాత్రం వారు ముందుగా తెలుసుకోవలసి ఉంటుందని నే కోరతాను."

కిరీటి చెప్పతూన్నదంతా వింటూ మౌనంగా కూర్చుండిపోయింది వనజ. ఆమెమనస్సులో ఇప్పు

డేమున్నదీ నేను సరిగ్గా చెప్పలేను. అసలు నాకు తెలియనే తెలియదు! కాని ఆమెముఖభంగిమల్నిబట్టి కిరీటితో ఏకీభవిస్తున్నదేమోనని మాత్రం ఊహిస్తూ ఉన్నాను.

వనజమాత్రం "అంతేనా బావా!" అని గద్గద స్వరంతో అంటూనే, అతని కాళ్లను చుట్టవేసుకుని, అతని ఒడిలో తల ఉంచి పొర్లుకొస్తోన్న దుఃఖతరంగాల్ని గుమ్మరిస్తోంది...

కిరీటి అంతరంగంలో విద్యుచ్ఛక్తిలాంటి మహత్తరశక్తి ఏదో ప్రవహించి—ఇన్నాళ్లనుంచీ తనలో తమాయించుకుంటూవస్తోన్న దుఃఖభారం పొంగి పొర్లి అశ్రుధారలై వనజ శిరస్సుపైనుంచి పారుతోన్నై. ఎన్నాళ్లనుంచో తనలో పోషించుకుంటూవచ్చిన కోరికలూ, కాంక్షలూ, మహోత్కృష్టమైన సిద్ధాంతాలతో ఆత్మోత్తేజత పొందిన కిరీటి హృదయమే క్లేశంతో కరగి, నీరై, కన్నీటి కాల్వలై వనజకురుల్లో పేరుకుపోతూఉన్నై.

వనజకూడా ఇదేస్థితిలో అశ్రుధారలతో కిరీటి పాదాలకు పూర్ణాభిషేకం చేస్తోంది! నిజంగా అవి ఆమెలో నిర్మించుకున్న ఊహాహర్మ్యాలూ, సుఖస్వప్నాలూ, మమత్వాకాంక్షలూ — ఒకటేమిటి? సర్వస్వమూ కరిగి కన్నీటికాల్వలై కిరీటి పాదాలమీదనుంచి ప్రవహిస్తూఉన్నై.

అలానే చాలాసేపటివరకూ ఇద్దరూకూడా దుఃఖావృత మనస్కులై ఉండిపోయారు. ఎవరైనా తమ స్థితిని అప్పట్లో చూస్తే ఏమనుకుంటారో, ఏం ప్రమాదం వస్తుందో అన్న భయం వారిలో మృగ్యమైపోయిం దాసమయంలో!

తర్వాత కొంతసేపటికి ఈ యోగసమాధినుంచి కిరీటి తెప్పరిల్లి, చూసి, తన ఒడిలో వాలిఉన్న వనజముఖం పైకెత్తి కన్నీటితో తడిసి ముద్దలైన వనజ ముంగురులను చెవిపైకి తప్పిస్తూ "వనజా!" అని ముఖం మీద ముఖం పెట్టి ఎంతో ఆదరంగా పిలిచాడు. కిరీటి అలా రెండుమూడు దఫాలు పిలవగా కొంతసేపటికి రెప్పలు విప్పి చూసింది వనజ. ఇంతవరకూ తాను కిరీటిఒళ్లో తలపెట్టుకున్నట్లు తెలుసుకుని సిగ్గుపడింది. చప్పున లేవాలని ప్రయత్నంకూడా చేసింది.

ఇంతలోనే "లే, వనజా! లే! వచ్చికూడా చాలాసేపయింది" అని స్నేహంగా పిలుస్తూ, వనజ బాహుద్వయాన్ని తన రెండు చేతులతో పట్టుకుని లేవనెత్తేసరికి అతని ఆధారంతోనే వనజ పైకి లేచి నిలబడింది. ప్రక్కనే గోడకు చారబడి, చెక్కిళ్ల మీదకు జారుకొస్తోన్న కన్నీటిని తుడుచుకుంటూ మెదలకుండా నిలబడిపోయింది. ఆమె తల, ఒళ్లు, బట్టా కన్నీటితో తడిసి ముద్దలయిపోయినై.

కిరీటి గొంతు సవరించుకుని మళ్ళీ ఇలా చెప్ప సాగాడు: "—ఇవన్నీ ఎంత నిజమైనా ఎవరికి?—పైగా నీకర్తవ్యం అనేది ఒకటున్నదిగా! ఇక నువ్వూ కలవరపడిమాత్రం ప్రయోజనం? అందుకనే... ...నాసుఖానికి అర్పించాలనుకున్న నీ జీవితాన్ని పరులకు సుఖసౌఖ్యాలు చేకూర్చటంలో సమర్పించు వనజా! ప్రేమించి, ప్రేమింపబడిన నీ కిది అసాధ్యమైంది కాదు. సరే!...ఇక నువ్వు వెళ్లిరా! చాలా ఆలస్యంకూడా అయింది" అని కిరీటి తొందరబడ్డాడు.

వనజకళ్లు నీటితో నిండిపోయినై. ఆమె ముందుకు వంగి కిరీటిపాదాల్ని తాకబోతోంటే, అతను ముదిత మనస్కుడై, "అదేమిటి వనజా!" అంటూనే తానూ వంగి చప్పున ఆమె రెండుచేతులనూ తన చేతుల్లోకి తీసుకుంటూ, ఆమెశిరస్సును ఓష్ఠాగ్రాలతో స్పృశిస్తూ, "ఎందుకు ఇంతఅధైర్యపడతావు? వెళ్లిరా... నువ్వు అభిమానినివని నాకు తెలుసు! అదే నిన్ను రక్షిస్తుంది!" అని ఆశీర్వదించాడు.

చీరచెరగుతో కళ్లు ఒత్తుకొని, వెళ్ళొస్తానని కళ్ళతోనే చెప్పి, శుష్కవదనంతో వనజ ముందుకు కదిలింది...ఆమె వెళ్ళిపోతోంటే—చీరచెరగు గాలిలో పైకిలేచి, గపరెపా కొట్టుకొంటూ, పడగవిప్పుకుని పరుగులుతీస్తోన్న నాగుబాములాగా కనబడింది. కిరీటి ఆమెకేసి చూస్తూనే కూర్చుండి పోయాడు.

* * *

భగవంతుని సృష్టిలో ప్రతిజీవికీ ఏదో ఒక కొరత ఉంటూనే ఉంటుంది. అది భగవంతుడు చెయ్యాలనే చేతులారా చేస్తోంటాడో, లేక తన కతీతమయే వదిలిపెట్టుతూ ఉంటాడో మరి తెలియదు!

ఆ మర్నాటిరాత్రే రంగయ్యగారి జ్యేష్ఠపుత్రునితో వనజవివాహం కాస్తా యథావిధిగా జరిగింది.

అంపకాలూ అవీ అయేసరికి తెలతెలవారుతోంది. జగన్నాటకానికి రంగస్థలమే ఒక్కమాటుగా పడమటినుంచి తూర్పుకు మార్చబడుతోంది. ఇక

అనూరసారథ్యంతో ఆకాశరంగంపైకి ప్రభాకరుడొచ్చే సమయంకూడా సమీపిస్తోంది. శశాంకు డప్పుడే వెలవెలబారి పోతోన్నాడు. పక్షులు కిలకిలారావంతో తమతమ గూళ్లనుంచి ఎగిరిపోతోన్నై.

అలాంటి సమయంలో పెళ్లివారి గండెడ్లబళ్లు పటాటోపంగా తిరుగుముఖం పట్టినై.

తా నిక నిర్వహించాల్సిన వారికర్తవ్యాన్ని గుర్తించి, తన కళార్వమైన కర్తవ్యభారాన్ని ఒక్క మాటుగా నెత్తిని వేసుకుని వనజ మేనాలో పాదం పెట్టింది. కళ్లల్లో కిరీటి ముఖమే పొడగట్టింది. పరోక్షంగా ఉండి తనను చూస్తోన్న కిరీటికూడా దైవవశాత్తూ ఆమె కంటబడ్డాడు. కలువరేకుల్లాంటి కళ్లు విప్పి ఒకమాటు వనజ కిరీటికేసి చూసింది.

స్వజనమంతా కంట తడిపెట్టుకుంటూ ఆమెను సాగనంపారు.

కిరీటి కొంతసేపటివరకలా చూస్తూ ఉండిపోయాడు. మనస్సంతా వనజమయమైంది. చప్పున అతడు తన గదిలోకి చేరుకుని, "బరువుభారాన్ని వహించి ఆమె జీవితాన్ని సుఖాంతం చెయ్యలేకున్న హతభాగ్యుణ్ణి! నిజంగా—అందుకు నే నధికార్ని కాలేకపోయాను. దయామయా! నువ్వు నా ఆమెను మనస్ఫూర్తిని నిల్పి, రక్షించు! అదే నా ఆజన్మవాంఛ! ...ఇంతకుముందెన్నడూ, ఇంత త్రికరణశుద్ధిగా నిన్ను నే తలచిఉండను. ఇదిగో! ఇవ్వాళ ప్రార్థిస్తున్నాను" అని భగవంతు నుద్దేశించి కిరీటికళ్లు కాసేపు మూతలుపడినై. కనుకొలకులనుంచి అశ్రుబిందువులు రెండే రెండు రాలినై. ఇంతకుముందెన్నడూ ఇంత స్వచ్ఛమైన అశ్రుబిందువులు రాలలేదు! కాసేపటికి కిరీటి మనస్సంతా వనజమయమైంది. మేనాలో కూర్చుని తనకేసి చూసినప్పటి వనజ ముఖభంగిమ అతని కళ్లల్లో మెలగసాగింది. కాసేపు వనజ ఏడుస్తూఉన్నట్టూ, మరి కొంతసేపు నవ్వుతూఉన్నట్టూ, "బావా!" అని ఒకసారి పిలిచినట్టూ, ఇంకోసారి క్షీణమైన ఎన్నెన్నో సంగతులు పలికిస్తూ, గానామృతాన్ని ఒలికిస్తూ, ఆమె కభిమానమైన ఆ అష్టపది......

*"అందని నిను మును ధ్యానలయంబున
అతివ నిల్పుకొని పొంపున్,
చెందును దుఃఖము, నవ్వును, తిరుగును,
చిత్తము వెతతో గ్రుంగన్"

అని శ్రవణానందంగా పాడుతూఉన్నట్టూ ఆమె కోకిలకంఠస్వరం అతని కింకా వినబడుతూనే ఉంటుంది.

---

* శ్రీరాజా వెంకటాద్రి అప్పారావు బహద్దూరుగారు తెనిగించిన గీతగోవిందంనుంచి.

